ఘనంగా నవగ్రహాల ప్రతిష్ఠాపన

హోమంలో పాల్గొన్న భక్తులు

బోధన్ రూరల్, డిసెంబర్ 14: బోధన్ మండలం రాజీవ్‌నగర్ తండా గ్రామంలోని శ్రీ హనుమాన్ మందిరంలో నవగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, హోమం తదితర కార్యక్రమాలు కొనసాగగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ నామ్‌దేవ్‌నాయక్, కోశాధికారి ఆర్. రవిదాస్‌నాయక్, స్థానిక సర్పంచ్ రంజ్యానాయక్, ఉప సర్పంచ్ విఠల్‌నాయక్, గ్రామ పెద్దలు మోహన్‌నాయక్, గోప్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగదాంబమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవం

బోధన్ మండలం రాజీవ్‌నగర్ తండాలోని జగదాంబమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నామ్‌దేవ్‌నాయక్, కోశాధికారి ఆర్. రవిదాస్‌నాయక్ తెలిపారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, భోగ్‌భండార్ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడా ప్రాంగణం పనులు షురూ

క్రీడాప్రాంగణ బోర్డును ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

బాల్కొండ, డిసెంబర్ 14: మండల కేంద్రంలో ఎట్టకేలకు క్రీడా ప్రాంగణానికి మోక్షం లభించింది. క్రీడా ప్రాంగణం కబ్జాకు గురైందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో సర్వే నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. నివేదిక ఆధారంగా 1375, 1376 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమిని గుర్తించారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం హద్దులు గుర్తించి క్రీడా సామగ్రిని ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణం ఏర్పాటు పనులు ప్రారంభం కావడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా నరేశ్

వేల్పూర్, డిసెంబర్ 14: మండలంలో పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షుడిగా అంకం నరేశ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దేవానం నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా నాయకులు పెంట జలంధర్, తుమ్మల లక్ష్మణ్, రచ్చ మురళి, గోపాల్, ప్రవీణ్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

రెంజర్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీసీ సూపర్‌వైజర్ మాధవి

ముప్కాల్, డిసెంబర్ 14 : మండలంలోని రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, పోషకాహారం, లైంగిక వేధింపులు, పరిసరాల పరిశుభ్రత, షీటీంపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీసీ సూపర్ వైజర్ మాధవి, ఏఎస్సై గంగారాం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్, ఐసీపీస్ సిబ్బంది సాయిలు, చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీసు సిబ్బంది ఉద్దవ్, రమాదేవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం

పట్టణంలోని చొక్కయ్య గుట్ట శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణోత్సవం వేద పండితులు నంబి వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ దంపతులు కన్నె ప్రేమలత -సురేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. –భీమ్‌గల్, డిసెంబర్ 14

కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

తాళిబొట్టును చూపిస్తున్న వేదపండితులు

ఎరువులను అందుబాటులో ఉంచాలి

బాల్కొండ, డిసెంబర్ 14: బాల్కొండ విండో ద్వారా రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి ..అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం బాల్కొండ విండో పరిధిలో సొసైటీ ద్వారా 48 టన్నులు, ప్రైవేట్ ద్వారా 30 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో అవసరమైనంత యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. వెంట సొసైటీ సీఈవో మొహీద్‌పాషా, సిబ్బంది ఉన్నారు.

18న కు.ని.ఆపరేషన్ శిబిరం

ఆర్మూర్‌టౌన్,డిసెంబర్14: పట్టణంలోని ఏరియా ప్రభుత్వ దవాఖానలో ఈనెల 18వ తేదీన వాసెక్టమీ ఆపరేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి సుదర్శనం తెలిపారు. గురువారం ఆయన ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానలో మాట్లాడారు. కోత లేకుండా చాలా సులభంగా నిర్వహించే ఆపరేషన్ అని, దీని ద్వారా ఏ విధమైన సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని వివరించారు. ఆపరేషన్ కోసం వచ్చేవారు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీహెచ్ఎంవో డాక్టర్ రమేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాగాపూర్‌లో ఇఫ్కో క్షేత్ర దినోత్సవం

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 14 : మండలంలోని నాగాపూర్‌లో గురువారం ఇఫ్కో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. 20 రోజుల క్రితం నాగాపూర్‌లో డెమో రూపంలో నానో యూరియా, నానో డీఏపీ రైతులకు ఇచ్చి గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వాటి పనితీరును వివరించారు.నానో యూరియా, నానో డీఏపీ వాడే విధానం, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి విండో చైర్మన్ రేగుంట దేవేందర్, బీఆర్ఎస్ నాయకుడు రవి కిరణ్, ఇఫ్కో ప్రతినిధులు శివరామ కృష్ణ. ఐ.అరుణ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పాదరక్షల పంపిణీ

కుర్నాపల్లిలో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

ఎడపల్లి, డిసెంబర్ 14 : ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో గ్రీన్‌సోల్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గురువారం స్కూల్ బ్యాగులు, పాదరక్షలను పంపిణీ చేశారు. పీఆర్టీయూ అధ్యక్షుడు పసుల అభిమన్యు, ప్రధాన కార్యదర్శి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు అంచెలి శంకర్, హెచ్ఎం సాయిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాకీ పోటీలకు ఎంపికైన మెండోరా విద్యార్థులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మెండోరా, డిసెంబర్ 14 : కామారెడ్డి జిల్లా కేంద్రంతో ఈ నెల 8న నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల హాకీ సెలక్షన్స్‌లో మెండోరా జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ పింజ సురేందర్ గురువారం తెలిపారు. బాలుర విభాగంలో వి.జశ్వంత్, బి.మొగులాజీ, బాలికల విభాగంలో గంగోత్రి, నిత్య ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అభినందించారు.

'ఉపాధి'లో సామాజిక తనిఖీ

- విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం
- డీఆర్డీవో చందర్‌నాయక్ ఆగ్రహం

రెంజల్, డిసెంబర్ 14 : ఉపాధి హామీలో సిబ్బంది నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగంపై డీఆర్డీవో చందర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం 15వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2022 ఏప్రిల్1 నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధిహామీలో రూ. 3.36 కోట్లతో పనులు చేపట్టగా.. గ్రామాల వారీగా బీఆర్‌పీలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన నివేదిక వివరాలను సామాజిక ప్రజావేదికలో చదివి వినిపించారు. మండల కేంద్రంలో 2020-21 సంవత్సరంలో ఓ దంపతులు మృతిచెందగా.. ఇంకా వారు బతికి ఉండి కూలిపనిచేసినట్లు రికార్డుల్లో చూపుతూ రూ. 1.473 చెల్లించినట్లు గుర్తించారు. కందకుర్తి, రెంజల్, నీలా, బాగేపల్లి, సాటాపూర్ గ్రామాల్లో డబ్బుల చెల్లింపు, జాబ్‌కార్డుల జారీ, పనులు చేసినా కూలి డబ్బులు అందకపోవడం, గ్రామ సభలు నిర్వహించకపోవడం, రికార్డులకు అందించకపోవడం తదితర వైఫల్యాలను తనిఖీ బృందం సభ్యులు బయటపెట్టారు. దీంతో ఇందుకు బాధ్యులైన గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పూర్తి వివరాలు తెలుసుకొని శుక్రవారం చర్యలు తీసుకుంటామన్నారు.

19న వాహన వేలం

ఏర్గట్ల, డిసెంబర్ 14 : మోర్తాడ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ద్విచక్రవాహన వేలం నిర్వహించనున్నట్లు సీఐ గుండప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా గుడుంబా తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్న టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనానికి మోర్తాడ్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సూచించారు. ముందుగా రూ.1000 డిపాజిట్ చేయాలని ఆయన సూచించారు.

పెట్టబడి సాయం రైతుల ఖాతాల్లో జమచేయాలి

నవీపేట,డిసెంబర్ 14: రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమచేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు యాసంగి పంటలు వేసుకుంటున్న తరణంలో వారికి రైతు బంధు డబ్బులను ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు,ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు దేవేందర్‌సింగ్, కిషన్, రాంసింగ్, గంగాధర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కోనసముందర్‌లో 'ఉపాధి' గ్రామసభ

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 14 : మండలంలోని కోనసముందర్‌లో సర్పంచ్ ఇంద్రాల రూప రాజు అధ్యక్షతన బుధవారం ఉపాధిహామీ పథకంపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నూతన నర్సరీ కోసం స్థలం చదును చేసి ప్రైమరీ బెర్డ్‌కు సిద్ధం చేయాలని సూచించారు. హరితహారంలో భాగంగా మొక్కలకు ఒకరోజు తప్పి రోజు నీటిని అందించాలన్నారు. అనంతరం అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యదర్శి నవీన్‌గౌడ్, టీఏ మంజులా రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ జంగిటి గోపాల్, కారోబార్ మోహన్ పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

ఆర్మూర్ టౌన్, డిసెంబర్14: పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రాజస్వీ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 జనవరి ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.